

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

22 నవంబర్ 2025 పేజీలు : 08 శనివారం






## కారుణ్య నియామకాలు

నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :

కారుణ్య నియామకం ద్వారా ముగ్గురికి ఉద్యోగావకాశాలు కల్పిస్తూ.. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఉత్తర్వులను అందించారు. నెల్లూరు కలెక్టర్ వారి చాంబర్‌లో ముగ్గురు మహిళలకు నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ అందించారు. కే.సంధ్య అనే మహిళను విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ గ్రేడ్–2గా, కే.సునీలను వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, జి.వనితకు ఆఫీస్ సబార్డినేట్, ఆర్జెడి ఇంటర్మీడియట్ విద్య శాఖలో ఉద్యోగాలు కల్పిస్తూ నియామక ఉత్తర్వులు అందించారు. విధుల పట్ల అంకిత భావంతో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్ర మంలో డీఆర్ఓ విజయ్ కుమార్, కలెక్టరేట్ ఏవో తుమ్మా విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యకారుల సంక్షేమానికి..


# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి

- సబ్సిడీపై పెద్దసంఖ్యలో పథకాలు
- అవగాహన పెంచుకుని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి
- నేలటూరు జెట్టీని పూర్తి చేసే బాధ్యత నాది
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :

ప్రపంచ మత్స్య దినోత్సవం కార్యక్రమం నగరంలోని టౌన్ హాలులో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర యాదవ్, ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, ఏపీ ఆక్వా అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్.శివప్రసాద్, ఆప్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు పోలిశెట్టి తదితరులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసీపీ హయాంలో నవరత్నాలు తప్ప మిగిలిన అన్ని అంశాలను విస్మరించారన్నారు. కీలకమైన శాఖలను, ప్రాజెక్టులను మూలన పడేశారని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమాన్ని సైతం విస్మరించారని, కేంద్ర ప్రభుత్వ లింకేజీ పథకాలను కూడా మూలన పెట్టేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమం రెండింటిపై దృష్టి పెట్టి ముందుకు సాగుతున్నారు. పులికాట్ సరస్సు అభివృద్ధికి రూ.92 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. వేట విరామ భృతిని గత ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తే, కూటమి ప్రభుత్వం రూ.20 వేలు చొప్పున అందిస్తోందన్నారు. ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. మత్స్యకారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని తెలియజేశారు. వలలు, బోట్లు, చేపల



-మిగతా 2లో

### మహిళా మహిళల సాధికారత దిశగా..

## కూటమి ప్రభుత్వ పాలన

- లైంగిక వేధింపులు, హింసకు వ్యతిరేకంగా మహిళలకు రక్షణ
- మహిళలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుగా పోస్టులు చేస్తున్న వారికి కఠిన శిక్షలు పడేలా చర్యలు
- ఉచిత బస్సులో వృద్ధ మహిళల కోసం ప్రత్యేకంగా ఒక సీటు కేటాయింపు
- పాఠశాలలు, కళాశాలల వద్ద సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి చేయాలి
- వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలపై పర్యవేక్షణ మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాసనసభ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

వివరాలు 2లో



### రైతుల పనులకు టీడీపీ

## బిల్లులు పెట్టడం దారుణం

మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి



5లో..

సర్వేపల్లి గ్రామంలో రైతులతో సమావేశమైన మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి.. టీడీపీ నేత సోమిరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రైతులు చందాలు వేసుకుని చేసిన కాలువ పనులకు కూడా టీడీపీ నాయకులు దొంగ బిల్లులు పెట్టి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :

ఓటర్ల జాబితా నవీకరణ పారదర్శకంగా నిరంతరంగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 2002 నుంచి 2005 మధ్యలో నమోదైన ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ కూడా చేపట్టినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఫారం–6లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫారం–6లను సంపూర్ణంగా పూర్తిచేసే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు నూతన ఓటర్లకు అవగాహన కలిగించాలన్నారు. ఫారం 7, 8పై ప్రత్యేక దృష్టి పెట్టి నమోదు

-మిగతా 2లో

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదిన సందర్భంగా..

# విద్యార్థులకు టీడీపీ నాయకుల చేయూత

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి
- అన్ని దానాలలో కెల్లా విద్యాదానం గొప్పదన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశయం అభినందనీయం
- విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమన్నది ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆకాంక్ష
- వీపీఆర్ విద్య ద్వారా వేలాది మందికి ఉచితంగా విద్యాదానం
- టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి



**కోవూరు, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కోవూరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు అండగా నిలిచేందుకు టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి ముందుకు వచ్చారు. నెల్లూరు నగరం మాగుంట లేఔట్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో 10 తరగతి చదివే విద్యార్థినీ విద్యార్థుల పరీక్ష ఫీజులకు సంబంధించి 2 లక్షల 96 వేల రూపాయలు ఆయన మండల విద్యాశాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కోడూరు కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీశైలం మల్లన్నకు బంగారు రథ బహుకరణ, శ్రీ పుట్టపర్తి సాయిబాబా వారి పాదుకలను జిల్లా ప్రజల సందర్శనకు తీసుకురావడం, లక్ష దీపోత్సవ నిర్వహణ లాంటి వేమిరెడ్డి దంపతుల ఆధ్యాత్మిక సేవలను కొనియాడారు. ఆస్తి అంతస్తుల కన్నా చదివే ముఖ్యమన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆమె జన్మదినం సందర్భంగా 10వ తరగతి చదివే విద్యార్థుల ఫీజులు చెల్లించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వీపీఆర్ విద్య పేరుతో ఎంతో మందికి విద్యాదానం చేస్తున్న ఆమె సేవా కార్యక్రమాల స్ఫూర్తిగా వీపీఆర్ అభిమానుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కోడూరు కమలాకర్ రెడ్డి పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు పెద్ద మొత్తం కానప్పటికీ వేమిరెడ్డి దంపతుల సేవా కార్యక్రమాలలో తాము భాగస్వాములు ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. కష్టపడి చదివి 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కలను సాకారం చేయాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కోవూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డి పాళెం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, ఏకొల్లు పవన్‌కుమార్ రెడ్డి, నాప వెంకటేశ్వర్లు నాయుడు, ఏటూరి శ్రీహరి రెడ్డి, గుత్తా శ్రీనివాసరావు, చేనేత సంఘ రాష్ట్ర నాయకులు కెవి శేషయ్య, టిడిపి నాయకులు ఇంత మల్లారెడ్డి, మోర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా మహిళల సాధికారత దిశగా కూటమి ప్రభుత్వ పాలన

## మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాసనసభ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** మహిళలకు స్వయం ఉపాధి కల్పన, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రతేక ప్రోత్సాహకాలు అందజేసి మహిళల సాధికారతకు కృషి చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట రాజధాని అమరావతిలోని శాసనసభ కమిటి హాలులో నిర్వహించిన సమావేశంలో ఆమె.. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాసనసభ కమిటీ సభ్యురాలి హెూదాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోవూరు నియోజకవర్గ పరిధిలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, కార్యాచరణ గురించి వివరించారు. అనంతరం మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాసనసభ కమిటీ చైర్మన్, పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అధ్యక్షతన ఉచిత బస్సులో వృద్ధ మహిళల కోసం ప్రత్యేకంగా ఒక సీటు కేటాయింపు, ప్రతి పాఠశాల, కాలేజీల్లో మహిళల కోసం డిస్పెన్సరీలు, మహిళల స్వయం ఉపాధి తదితర అంశాలపై చర్చించారు. సోషల్ మీడియాలో మహిళలపై తప్పుగా పోస్టులు చేస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి ఫిర్యాదులు నమోదు చేయాలని, వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలని తీర్మానించారు. మహిళలు, పిల్లల భద్రత కోసం రౌండ్ ద క్లాక్ కమాండ్ సెంటర్లు, ఉమెన్ ట్రాఫికింగ్‌పై యాంటీ ట్రాఫికింగ్ వ్యవస్థను పటిష్టం చేసే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. పాఠశాలలు, కళాశాలల వద్ద సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి చేయాలని, రాష్ట్రంలోని అన్ని హాస్పిటల్స్, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, దేవాలయాలు వంటి ప్రదేశాల్లో వృద్ధులు, వికలాంగుల కోసం వీల్ చైర్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాల ఏర్పాటు. ప్రైవేట్ వృద్ధాశ్రమ, అనాథాశ్రమాలపై పర్యవేక్షణ చేసేలా ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ సమావేశంలో మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో పాటు మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వృద్ధుల సంక్షేమ శాసన సభ కమిటీ నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గల్లా మాధవి, ప్రతిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ ఎమ్మెల్సీలు కావలి గ్రీష్మ ప్రసాద్, మధుసూదన్, కల్పలత తదితరులు పాల్గొన్నారు.

## పోరాట ఫలితమే అంగన్వాడీలకు పదోన్నతలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్వాడీ కార్యకర్తలను మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలుగా పదోన్నతి కృంచిందని సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, గడ్డం నాగేశ్వరరావు, కోడె రమణయ్యలు పేర్కొన్నారు. వారికి శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద పదోన్నతి పొందిన కార్యకర్తలు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 42 రోజులపాటు అంగన్ వాడీల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశామన్నారు. ఆ పోరాట ఫలితంగానే ఉదయగిరి ప్రాజెక్టు పరిధిలో 36 మంకి పదోన్నతి లభించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయబ్, బాజావ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు తహసిల్దార్ల బదిలీలు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో ముగ్గురు తహసిల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఉత్తర్వులు జారీ చేశారు. పివి కృష్ణారెడ్డిని కలువాయి తహసిల్దార్‌గా నియమించారు. అలాగే కందుకూరు డిఏఓగా ఉన్న ఎస్ సీతామహాలక్ష్మిని జలదంకి తహసిల్దార్‌గా బదిలీ చేశారు. చేజర్ల తహసిల్దార్‌గా ఉన్న బి.మురళిని ఇందుకూరుపేట తహసిల్దార్‌గా నియమించారు. అలాగే మరో నలుగురు డిప్యూటీ తహసిల్దార్లను బదిలీ చేశారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా

(మొదటి పేజీ తరువాయి)

చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడం ప్రధాన లక్ష్యమన్న కలెక్టర్, ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ సహకరించాలని కోరారు. అదేవిధంగా రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. త్వరలోనే రాజకీయ పార్టీల ప్రతినిధులకు శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. సమావేశంలో డీఆర్ఓ విజయ్‌కుమార్, టీడీపీ రసూల్, బిజెపి శ్రీనివాస్, వైఎస్ఆర్ సిపి వెంకట శేషయ్య, బీఎస్పీ శ్రీరామ్, కాంగ్రెస్ బాల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


## మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి



(మొదటి పేజీ తరువాయి)

రవాణా, విక్రయం, నిల్వ సౌకర్యాలు, చేప ల ఉత్పత్తి, హేచరీలు తదితర అంశాల్లో భారీగా సబ్సిడీ అందిస్తున్నాయన్నారు. ఆయా కార్యక్రమాలు, పథకాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రూ1.20 కోట్ల విలువైన పెద్ద బోట్లను 40 శాతం, 60 శాతం సబ్సిడీపై అందిస్తున్నారన్నారు. రుణాల మంజూరును సరళతరం చేయడంతోపాటు అర్బన్ ప్రాపర్టీ చూపాలనే అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి మత్స్యకారులకు అండగా నిలుస్తామన్నారు. గతంలో మత్స్యకారులు, ఆక్వా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆక్వా విద్యుత్ చార్జీలను యూనిట్ రూ.2కి చంద్రబాబు తగ్గించారన్నారు. వైసీపీ హయాంలో యూనిట్ రూ.1.50కి తగ్గిస్తున్నామని చెప్పి జోన్, నాన్ జోన్ పేరుతో రూ.5 నుంచి రూ.6 వరకు వసూలు చేస్తున్నారన్నారు. ముత్తుకూరు మండలం నేలటూరులో ఫిషింగ్ జెట్టీ నిర్మాణం జరుగుతోంది. అదానీ కృష్ణపట్నం పోర్టు రూ.17 కోట్లు ఖర్చు పెట్టి ఒక దశ పనులు పూర్తి చేసిందన్నారు. మరో రూ.17 కోట్ల విలువైన పనులకు ఏపీ మారిటైం బోర్డు నిధులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. త్వరలోనే మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యను జెట్టీ పరిశీలనకు తీసుకురాబోతున్నామన్నారు. నేలటూరు జెట్టీని పూర్తి చేసే బాధ్యత మాది అని హామీ ఇచ్చారు. క్లైమేట్ రెసిడెంట్ కోస్టల్ ఫిషర్ మెన్ విలేజ్ పథకం కింద తోటపల్లి గూడూరు మండలం ఈదూరు పట్టపుపాళెంలో రూ.2 కోట్లతో భవనాలు, చేపల ప్రాసెసింగ్ ఏర్పాట్లు కల్పించబోతున్నట్లు తెలిపారు. మత్స్యకారుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం జిల్లా ప్రజాప్రతినిధులందరం సీఎం దగ్గరకు వెళ్ళి, ఆయనకు వివరించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

## మంత్రి ఆనంను కలిసిన చెన్ను సోదరులు



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని రాపూరు మండల టీడీపీ అధ్యక్షుడిగా నియమితులైన చెన్ను అశోక్‌రెడ్డి మంత్రి నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పెంచలకోన దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ అధ్యక్షులు చెన్ను తిరుపాల్ రెడ్డితో కలిసి రాష్ట్ర మంత్రి ఆనంకు మండల టీడీపీ అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి దుశాలువాతో సత్కరించారు. టీడీపీ నూతన అధ్యక్షులుగా నియమితులైన చెన్ను అశోకరెడ్డిని మంత్రి ఆనం అభినందించారు. మాజీ ఎంపీపీ చెన్ను బాలకృష్ణారెడ్డి ఆశయాలకు అనుగుణంగా, పార్టీని బలోపేతం దిశగా అడుగులు వేసేవిధంగా కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ ముందుకు సాగాలని మంత్రి ఆనం.. చెన్ను సోదరులకు సూచించారు. కార్యక్రమంలో అకిలవలస సర్పంచ్ చెన్ను పెంచల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రైతులకు తరచూ అవగాహన సదస్సులు నిర్వహించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు లక్కు కృష్ణ ప్రసాద్ కోరారు. ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ మద్రాస్ ఫెర్టిలైజర్స్ వారి ఆధ్వర్యంలో ఆత్మకూరు అనంతసాగరం ఏఎస్పేట మండలాల పరిధిలో రైతులకు ఎరువులు పురుగుమందులు వాడకంపై, మిల్లెట్ ధాన్యాలపై శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. నెల్లూరు వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త, ఫర్టిలైజర్స్ మేనేజింగ్ డైరెక్టర్, ఆత్మకూరు అడిషనల్ డైరెక్టర్ దేవసేన ఆత్మకూరు ఏఎస్ పేట మండలాల వ్యవసాయ అధికారులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన 100 రైతులు హాజరయ్యారు. ఏపీ రైతు సంఘం నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి ఈ అవగాహన సదస్సుకు హాజరై తన అభిప్రాయాలను వెలిబుచ్చారు. రాష్ట్రంలోని జిల్లాల పరిధిలో వ్యవసాయ పరిశోధన క్షేత్రాలు ఉన్నాయని సదస్సులలో రైతులకు సూచించిన ఎరువుల వాడకం పురుగుమందుల వాడకాల సూచనల ప్రకారం వివిధ రకాలైన పంటలను వ్యవసాయ క్షేత్రంలోనే రైతుల సహకారంతో పంటలను పండించి దిగుబడి ఫలితాలను విశ్లేషించి రైతులకు ఇటువంటి సదస్సులు నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుందని సూచన చేశారు. 1960 ప్రాంతంలో ఆహార ధాన్యాల కొరత వలన అనేక కొత్త వరి వంగడాల సృష్టి జరిగిన తర్వాత ఎరువుల పురుగు మందుల వాడకం మీద కూడా అనేక పరిశోధనలు జరిగాయని ఫలితంగా అధిక దిగుబడులు వస్తున్నాయని ఈ దిగుబడులకు ఇప్పటివరకు అమలు చేస్తున్న విధానాలే కారణమని రైతులు భావిస్తున్న సందర్భంలో యూరియా వాడకాన్ని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని అధిక ఎరువుల వాడకం వలన క్యాన్సర్ వంటి జబ్బులు వస్తున్నాయని చెప్పడం రైతులు నమ్మడం లేదని మీరు చెప్పారు. దీనికి తోడుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేనివిధంగా 25శాతం ఎరువుల తగ్గించి 700 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం ద్వారా తెచ్చుకోవడం తదనగుణంగా మన రాష్ట్రంలో ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నారని తక్కువ ఎరువుల వాడకం శాస్త్రీయ పద్ధతిని చెప్పడంలో రైతులకు నమ్మకం పోతుందని తెలియజేశారు. యూరియా వాడకం తగ్గించడం మంచి ప్రక్రియ అయినప్పటికీ అమలు చేసే విధానంలో ఉన్న అనుమానాల వలన శాస్త్రీయ విధానాన్ని రైతులు అంగీకరించడం లేదని వారు తెలియజేశారు. యూరియా స్థానంలో నానో యూరియాను వాడకం చేయాలని పిలుపుతో పంజాబ్ వ్యవసాయ పరిశోధన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అంగీకరించడం లేదని నానో




యూరియా వాడకం వలన గింజలో ప్రోటీన్ శాతం తగ్గుతుందని పంట దిగుబడి 20శాతం తగ్గుతుందని మూడు సంవత్సరాల పరిశోధనానంతరం డాక్యుమెంటును విడుదల చేశారని తెలిపారు. అయితే ఇఫ్కో కంపెనీ తయారుచేసిన నానో యూరియా శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని అంగీకరించడం లేదు. 2020లో ప్రారంభించి 2023, 2024 నానో యూరియాను పరిచయం చేయడం రైతులలో నమ్మకం కుదరడం లేదని తెలిపారు. భూసార పరీక్ష కేంద్రాలను విస్తృతంగా మండలానికి ఒక పరీక్ష కేంద్రాన్ని స్థాపించి రైతులను పంటలు వేసే ముందుగానే భూసార పరీక్షలు చేయించుకుని ఏ మోతాదులో ఎరువులు ఉపయోగించాలో ఏ పంటలు వేయాలో శాస్త్రీయంగా తెలుసుకునేందుకు భూసార పరీక్ష కేంద్రాలను విస్తృతంగా పెట్టాలని డిమాండ్ చేశారు. కేవలం సంవత్సరానికి ఒక్కసారి ఇటువంటి సదస్సుల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని 65 లక్షల కోట్ల రూపాయల వ్యవసాయ రంగం పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకమైన శ్రద్ధ కనబరచాలని వ్యవసాయం మీద రైతులకు శ్రద్ధ పెరిగే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోరుకున్నదన్నారు. అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి పండించిన పంటలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా ప్రణాళిక తయారు చేయాలని అప్పుడు మాత్రమే వ్యవసాయం పట్ల రైతులకు భరోసా నమ్మకం కలుగుతుందని ఇటువంటి శాస్త్రీయమైన పద్ధతులు ప్రభుత్వం అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున కోరుతున్నానని కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు.

# ఆర్టీసీ బస్సులో పొగలు.. ప్రయాణికుల పరుగులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కొట్టాలు గ్రామం వద్ద ఆర్టీసీ బస్సులో పొగలు రావడంతో ప్రయాణికులు, విద్యార్థులు భయ భ్రాంతులకు గురై కిందకు పరుగులు తీసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు సాయంత్రం 5 గంటల సమయంలో ఉదయగిరి నుంచి జి.అయ్యవారిపల్లికి బయలుదేరింది. కిక్కిరిసిన విద్యార్థులు, ప్రయాణికులతో బయలు దేరిన బస్సు కొట్టాలు గ్రామ సమీపానికి చేరగానే డ్రైవర్ వద్ద ఉన్న స్విచ్ బోర్డు షార్ట్ సర్క్యూట్‌కు గురై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ దానిపై నీళ్లు చల్లడంతో బస్సులో పొగలు కమ్ముకున్నాయి. భయాందోళనకు గురైన విద్యార్థులు, ప్రయాణికులు బస్సులో నుంచి కిందకు పరుగులు తీశారు. స్విచ్ బోర్డు దగ్ధమవడంతో బస్సు దీపాలు వెలగలేదు. చేసేదేమీ లేక డ్రైవర్ వారందర్నీ అక్కడే దించేసి వెళ్లిపోయాడు. దీంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు ఆటవీ మార్గం గుండా విద్యార్థులు, ప్రయాణికులు కాలికి బుద్ధి చెబుతూ ఇళ్లకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్టీసీ సంస్థ కాలంచెల్లిన బస్సులు నడుపుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన బస్సులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

# ఉదయగిరి తాలుకా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడిగా రియాజ్

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి తాలుకా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడిగా షేక్ రియాజ్ ఏక గ్రీవంగా ఎంపికయ్యారు. శుక్రవారం స్థానిక పాదిమంజిల్లో ఎన్నికల అధికారిగా కావలి ఎన్జీవో అధ్యక్షుడు శివకుమార్, అబ్జర్వర్గా కిరణ్ సమక్షం లో ఉదయగిరి తాలుకా ఏపీ ఎన్జజీవో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. తాలుకా ఎన్‌జీవో అధ్యక్షుడిగా షేక్ రియాజ్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.తిరుపతమ్మ. ఉపాధ్యక్షులుగా సయ్యద్ ఖాజానవాజ్, భోగ్యం సుదీర్ కు మార్, షేక్ గౌస్అహ్మద్, కార్యదర్శిగా వీవీ రామ్మోహన్, సంయుక్త కార్యదర్శులుగా షేక్ అంజాద్, ఎం.మహేష్ భోగ్యం గాయత్రీ, మహిళా సంయుక్త కార్యదర్శిగా ఏ.రోజారమణి, ట్రెజరర్గా రాజశేఖర్ రాజులను సభ్యుల సమ్మతితో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర



ఉపాధ్యక్షుడు బందారు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయవర్మ, కార్యదర్శి రామకృష్ణ తోపాటు సభ్యులు, ఉద్యోగులు, స్నేహితులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ.. తన ఎంపికకు సహకరించిన ప్రతిఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గం బాధ్యతగా పని చేయాలన్నారు.

## పీఎంకేవీవై కింద ఉచిత నైపుణ్య శిక్షణ



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నిరుద్యోగ యువత కోసం ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) కింద ఉచిత నైపుణ్య శిక్షణను విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగనుంది. ఈ శిక్షణలో 'సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా విశ్లేషకుడు' అనే కోర్సుకు పదవ తరగతి లేదా అంతకంటే ఎక్కువ చదివిన నిరుద్యోగ యువత అర్హులు. శిక్షణ పూర్తిగా ఉచితం కాగా, కోర్సు పూర్తి చేసిన వారికి జాతీయస్థాయి గుర్తింపు పొందిన సర్టిఫికేట్, ఉద్యోగ సహాయం అందించబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు 22-11-2025 తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.విజేతను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## నేడు ఆత్మకూరులో అయ్యప్పస్వామీ పెద్దపూజ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఈనెల 23వ తేదీ ఆదివారం సాయంత్రం 7 గంటలకు, ఆత్మకూరు గ్రామ అయ్యప్ప స్వామి పెద్దపూజ అతి వైభవంగా జరుగుతుందని మణికంఠ సేవా సమాజం ప్రతినిధులు తెలిపారు. ఆధ్యాత్మికోత్సాహంతో గొప్ప మహిమగల శ్రీ అలఘునాథ స్వామి నూతన కళ్యాణ మండపంలో గురుస్వామి బుజ్జిరెడ్డి స్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించబడుతుందన్నారు. ఈ పవిత్ర పూజలో అన్ని గ్రామాల అయ్యప్ప భక్తులు, స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి మనసుకు, జీవితానికి ఆధ్యాత్మిక ఆనందం పొందగలరని మనవి చేశారు. అయ్యప్ప స్వాములు ఆత్మకూరు ప్రాంత గ్రామ పెద్ద పూజ కావున, ఎవరు మీ గ్రామాలలో గాని, ఇళ్లలో గాని ఆ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించక, మనమంతా ఏకమై ఈ పూజలో భాగస్వాములు కావాలని భక్తి పూర్వకంగా అభ్యర్థిస్తున్నామని ఆత్మకూరు సత్రం సెంటర్ మణికంఠ సేవా సమాజం ప్రతినిధులు పేర్కొన్నారు. వివరాలకు చెర్లో శ్రీనివాసులురెడ్డి స్వామి 9490462499, కంది చంద్రారెడ్డి స్వామి 9030808009లను సంప్రదించాలని వారు తెలిపారు.

## గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం స్థానిక జడ్పీ హైస్కూల్(వెస్ట్) నందు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెడ్మాస్టర్ ఎస్కే ఫయాజుద్దీన్ అధ్యక్షత వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో సభ్యత్వాన్ని పొంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ.శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. వారం రోజులు పాటు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశామని విద్యార్థులు అధిక సంఖ్యలో విచ్చేసి తిలకించారని తెలియజేశారు. ఈ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు వ్యక్తిత్వ వికాస పుస్తకాలను బహుమతులుగా అందజేయడం జరిగిందని తెలియజేశారు. అనంతరం గ్రంథాలయంలో చదువుకొని పోలీస్ కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయిన ఎస్కే అల్తాఫ్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పార్లపల్లి సుధాకర్‌రావు, ఎస్కే మహబూబ్ బాషా, పి.పెంచలయ్య, అన్వర్ షరీఫ్, పీఈటీ సృజన, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# ఎల్ఆర్ పల్లి పార్క్‌ను ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలి





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్ పల్లి పల్లె ఎస్ఎంకె పార్క్ పెండింగ్ పరిష్కరించి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని స్థానికుడు, జిల్లా రైతుసంఘ సంయుక్త కార్యదర్శి లక్కు కృష్ణ ప్రసాద్ కోరుతున్నారు. తనకు 8 సంవత్సరాల వయసు ఉన్నప్పుడే ఈ పార్కు ఆత్మకూరు గ్రామపంచాయతీ నిర్వహణలో చుట్టూ టెంకాయ చెట్లు, పూల చెట్లు మధ్యలో బావి ఒక వాచ్ మెన్ పర్యవేక్షిస్తూ ఈ ప్రాంత ప్రజలకు ఆనాడే ఒక పార్కుగా ఉండేదన్నారు. ఆత్మకూరు గ్రామపంచాయతీ మొత్తంలో ఉన్న ఏకైక పార్కు ఈ సౌదాగర మహబూబ్ ఖాన్ పార్క్. మధ్యలో బాల్ బ్యాట్మెంటన్ కోర్టు సాయంత్రమైతే జడ్జి, తహసిల్దార్ పోలీసు అధికారులు అందరూ బ్యాడ్మింటన్ ఆట ఆడేవారు. అలా లక్ష్మణరావు పల్లె యువత ఈ ఆట పట్ల మక్కువ పెంచుకొని జాతీయస్థాయి బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారులుగా ఎదిగారు. వారిలో మల్లిక శ్రీనివాసులు, డాక్యుమెంట్ రైటర్ షేక్ ఖాజా ఐ.రమేష్, కొత్తపల్లి రమేష్, కొండ శ్రీనివాసులు ఇలా చాలామంది క్రీడాకారులుగా ఒక వెలుగు వెలిగారు. ఆ ప్రాంత ప్రజలకు ఆహ్లాద ప్రదేశంగానూ, అధికారులకు ఆటవిడుపు ప్రదేశంగానూ, యువతకు క్రీడాప్రదేశంగానూ విలసిల్లినదన్నారు. డివైఎఫ్ఐ ఆత్మకూరు పట్టణ సంక్రాంతి ఆటల పోటీలకు క్రీడా ప్రాంగణంగా 30 సంవత్సరాలు అలరించిన ప్రదేశం ఈ మహబూబ్ ఖాన్ పార్కు అని, ఈ పార్క్ ఆవిర్భావం పూర్వాపరాలలోకి వెళితే మహబూబ్ ఖాన్ అనే దాత ఈ స్థలానికి ఆత్మకూరు గ్రామపంచాయతీ అనుమతి మేర సొంత ఖర్చులతో బావి, ప్రహరీ గోడ నిర్మాణం చేశారని ఈ ప్రాంత పెద్దలు చెప్పారన్నారు. 1950 సంవత్సరంలోనే ఈ పార్కు ఉండేదని తెలుస్తున్నది. ఈ పార్కు స్థలం ఆత్మకూరు తహసీల్దారు 1982 ప్రాంతంలో మార్కెట్ ధరకు పోస్టల్ డిపార్ట్మెంట్ వారికి మార్కెట్ విలువకు ఇచ్చారు. ఆత్మకూరు డైగ్లాట్ ను పరిశీలిస్తే ఈ స్థలం ఆత్మకూరు మున్సిఫ్ మ్యాజిస్ట్రేట్ కోర్టు, రోడ్డుకు సంబంధించిన స్థలంగా నమోదయి ఉన్నది. అటువంటి స్థలాన్ని మార్కెట్ ధరకు విక్రయించడం చట్ట విరుద్ధం. 2012వ సంవత్సరంలో ఆత్మకూరు పురపాలక సంఘం ఏర్పడిన తర్వాత గతంలో అనేక ప్రయోజనాల కొరకు కేటాయించబడిన ప్రభుత్వ స్థలాలు ఉపయోగించని సందర్భంలో వాటి కేటాయింపులను రద్దు చేశారు. అటువంటి వాటిలో ఈ స్థలం కూడా ఒకటి. పోస్టల్ డిపార్ట్మెంట్ వారు వారికిచ్చిన నోటీసును ఆసరా చేసుకుని గౌరవ హైకోర్టులో స్టే తెచ్చుకున్నారు. ఈ విషయమై రెవెన్యూ శాఖ వారు కాని న్యాయ శాఖ వారు కానీ ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలియడం లేదు. ఈరోజు పురపాలక సంఘం ఏర్పడి 35 వేల జనాభాకు ఎటువంటి పార్కులు లేని సమయంలో అందరికీ అందుబాటులో పట్టణం నడిబొడ్డులో ఉన్న ఈ స్థలాన్ని ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలి. నియోజకవర్గ హెడ్ క్వార్టర్స్ గా ఉండి ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ఉండి మురికి కూపంగా డంపింగ్ యార్డ్ ను తలపించే విధంగా ఉన్న పార్కును అభివృద్ధి పరిచే విధంగా మంత్రి ఆలోచించాలని పౌర సమాఖ్య తరపున అభ్యర్థిస్తున్నామని ప్రసాద్ కోరారు.

# సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి, సంక్షేమం : ఎమ్మెల్యే సోమిరెడ్డి





**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి తోపాటు సంక్షేమాన్ని కొనసాగిస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం అయిన వల్లూరు గ్రామపంచాయతీలో పర్యటించారు. ఆయనతోపాటు మండల పార్టీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ ఉన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యల గురించి అర్జీలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడారు. పంటపాలెం కేంద్రంగా ఉన్నటువంటి పరిశ్రమల సహకారంతో గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా బ్రహ్మదేవం వద్ద ఎస్ఈఐఎల్ కంపెనీ హాస్పిటల్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తుందన్నారు.ఎస్టీ కాలనీల్లో ఇంటింటికీ సమస్యలు అడిగి తెలుసుకుందామని వారి సమస్యలకు పరిష్కారం చూపెడతామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. వల్లూరు ఎస్టీ కాలనీలో 27 కుటుంబాలను ప్రాజెక్టు దత్తత తీసుకోవడం చాలా సంతోషకరమన్నారు. మొదటి విడతలో శుద్ధి జల కేంద్రం, కాలనీ లెవలింగ్, హెల్త్ సెంటర్ పనులు చేస్తుందఅన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు రైతులకు అవసరమైన పనులు చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే వల్లూరు, కోడెలమిట్ట, మల్లూరు, ఈపూరు గ్రామాల్లో రైతు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రసాయన ఎరువులు తగ్గించి సూక్ష్మ పోషకాలను ఉపయోగించి వరి పంటలో దిగుబడి పెంచడం పై రైతులకు కంపెనీ యాజమాన్యం అవగాహన కల్పించడం చాలా బాగుందని ఎమ్మెల్యే ప్రశంసించారు. పీఓపీ(ప్యాకేజ్ ఆఫ్ ప్రాక్టీసెస్)లో భాగంగా 20 మందికి రూ.54వేలు వెచ్చించి కిట్లు పంపిణీ చేశారన్నారు. టెక్నాలజీ డెమానుస్ట్రేషన్‌లో భాగంగా 11 మందికి రూ.1.54 లక్షలు ఖర్చు చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి పేర్కొన్నారు. ఒక్కో స్ప్రింక్లర్ రూ.24 వేలు వెచ్చించి ఏడుగురు రైతులకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. బ్రహ్మదేవం హైస్కూలులో రూ.35 లక్షలతో అదనపు గది, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు అవుతుందని ఎమ్మెల్యే చెప్పడం జరిగింది. బ్రహ్మదేవి గ్రామ పరిధిలో హాస్పిటల్ నిర్మాణానికి 1.80 సెంట్లు భూమి కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ప్రభుత్వ నిధులకు తోడు సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. ప్రధానంగా రైతులు, గిరిజనులు, దళితులు, నిరుపేదల శ్రేయస్సు కోసం కష్టపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ స్వప్న, ఎంపీడీవో నాగమణి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 17వ డివిజన్ నందు రచ్చబండ కార్యక్రమం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం, 17వ డివిజన్ వడ్డీపాళెం నందు రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజా ఉద్యమం సంతకాల సేకరణ కార్యక్రమం 17వ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సేకరించారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ ఇన్‌చార్జ్ మల్లి హరిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు చెన్నారెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు గుంటక వంశీ,17వ డివిజన్ నాయకులు వల్లిపు పురుషోత్తం, బట్ట సుబ్రహ్మణ్యం, చల్ల భాస్కర్, వల్లెపు చంద్ర, ఓబుల్ రెడ్డి, రామ్ సుబ్బయ్య, తురక సీనయ్య, యనమల యువకృష్ణ, వల్లెపు కిషోర్, 18వ డివిజన్ ఇన్‌చార్జ్ భాను ప్రకాష్, నాయకులు రాజారెడ్డి, నిసర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ అంబాసిడర్స్‌కు శిక్షణ కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని చెత్త నుండి సంపద కేంద్రం వద్ద జీబికేఆర్ ఎస్టీ కాలనీ యందు గ్రీన్ అంబాసిడర్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ కే.శ్రీనివాసరెడ్డి పంచాయతీ ఈఓ కె.రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వింజమూరు మండలం వ్యర్థ రహిత మండలంగా స్వచ్ఛమైనటువంటి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దామని ఉద్దేశంతో గ్రీన్ అంబాసిడర్‌లను నియమించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. వారి ద్వారా గ్రామాలలోని చెత్తను తొలగించేందుకు తగిన సూచనలు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రీన్ అంబాసిడర్స్ ద్వారా తడి చెత్త పొడి చెత్త వేరు చేయించి చెత్త నుండి సంపద కేంద్రానికి తరలించేందుకు తగిన విధంగా ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాలలో పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అపరిశుభ్రత లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. గ్రామాల పరిశుభ్రత గ్రీన్ అంబాసిడర్స్ ద్వారా అవుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయమ్మ గ్రీన్ అంబాసిడర్స్ తదితరులు ఉన్నారు.

# బేటీ బచావో.. బేటీ పడావో అవగాహన కార్యక్రమం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని జాకీర్ హుస్సేన్ నగర్, నెల్లూరు గవర్నమెంట్ హై స్కూల్‌లో బేటీ బచావో బేటీ పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మహిళ, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.హేన సుజన్ ఆదేశాల మేరకు, జాకీర్ హుస్సేన్ నగర్ గవర్నమెంట్ హై స్కూల్‌లో 8వ, 9వ, 10వ తరగతుల విద్యార్థులకు ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పిల్లల హక్కులు, పీఓసీఎస్ఓ చట్టం, చైల్డ్ మ్యారేజ్ నిషేధ చట్టం, అలాగే ముఖ్యమైన ప్రభుత్వ హెల్ప్‌లైన్ నంబర్లు గురించి సమగ్రంగా సఖి వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వకేట్ ఎం. ప్రశాంతి వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వార్డు వెల్ఫేర్ సెక్రటరీ థామస్, మహిళా పోలీసులు జి.ప్రభావతి, ఎస్కే నాగిని, అలాగే పాఠశాల హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్, బీపీఎస్ గోడ పత్రికను ఆవిష్కరణ : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ పట్టణ ప్రణాళిక విభాగం ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాల గోడపత్రికలను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాలపై అవగాహన సదస్సును, విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భవన యజమానుల సౌకర్యార్థం మంత్రి పి.నారాయణ ఆలోచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం బీపీఎస్-2025 ఎల్ఆర్ఎస్ - 2025 పథకాల మార్గదర్శకాలను జారీ చేసి ఉందని తెలిపారు. బీపీఎస్ పథకంలో 01-01-1985 నుంచి 30-08-2025 మధ్యకాలంలో అనధికారికంగా, అనుమతికి మించి నిర్మించిన భవనాలను 11-03-2026 తేదీ లోపల ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేసుకోవాలని తెలియజేశారు. పూర్తి వివరాల కోసం బిపిఎస్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్-2025 పథకంలో అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ యాజమాన్యపు హక్కును పొందేందుకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం జూన్ 30వ తేదీకి ముందు వేసిన అనధికార లేఅవుట్లలోని రిజిస్టర్ కాబడిన అనధికార ప్లాట్లను ప్రణాళిక బద్ధంగా క్రమబద్ధీకరించేందుకు ఈ పథకాన్ని కొనసాగిస్తున్నామని కమిషనర్ తెలియజేశారు. పూర్తి వివరాలకు 1800-425-1113 టోల్ ఫ్రీ నెంబరును లేదా 7981651881 నెంబరు హెల్ప్ లైన్ ను సంప్రదించాలని, అధికారిక వెబ్సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి మాట్లాడుతూ నగర పాలక సంస్థ చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల కోసం అవసరమైన వ్యయాన్ని సమకూర్చేందుకు ఇలాంటి పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్, బిపిఎస్ పథకాల అమలు ద్వారా ప్రజలు తమ లేఅవుట్ ప్లాట్లు, భవనాలకు పూర్తి యాజమాన్య హక్కులను పొందగలరని తెలియజేశారు. కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే ఓపన్ ఫోరం కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి 11 వినతి పత్రాలను అందుకని వాటికి అధికారులు శాశ్వత పరిష్కారాలను అందించారు. ఆవిష్కరించిన గోడపత్రికలను అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రదర్శించేలా, బిపిఎస్ స్టిక్కర్లను అన్ని అనధికార భవనాలకు అంటించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వేనాటి శ్రీకాంత్ రెడ్డి, నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రఘునాథరావు, వేణు, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల పనులకు టీడీపీ బిల్లులు పెట్టడం దారుణం : కాకాణి



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లిలో రైతులతో సమావేశమైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రైతులు చందాలు వేసుకుని చేసిన కాలువ పనులకు కూడా తేదేపా నాయకులు దొంగ బిల్లులు పెట్టి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇరిగేషన్ ఇంజనీర్లు-కాంట్రాక్టర్లతో కుమ్మక్కై లంచాలు ఫోన్‌పే ద్వారా పంచుకున్న ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఆర్‌టీఐ ద్వారా వివరాలు అడిగినా అధికారులు భయపడి సమాచారం ఇవ్వడంలేదని మండిపడ్డారు. వరినాట్లు మొదలైనప్పటికీ యూరియా లభ్యంకాక రైతులు బ్లాక్ మార్కెట్‌లో కొనాల్సి వస్తోందని పేర్కొన్నారు. అధికారం లేకపోయినా రైతులకు సహాయం అందించేందుకు పోరాడుతామని, వైసీపీ ప్రభుత్వం వస్తే అవకతవకల న్నింటిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

# భవన నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అనుమతి తప్పనిసరి : కమిషనర్




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక రామలింగాపురం అండర్ బ్రిడ్జి ప్రాంతంలో శుక్రవారం పర్యటించారు. వర్షాలకు అండర్ బ్రిడ్జి ప్రాంతంలో వరద నీరు చేరడంతో అందుగల కారణాలను ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పర్యవేక్షించారు. సమీపంలోని డ్రైన్ కాలువ ద్వారా మురుగునీరు లీకేజీ అయి బ్రిడ్జి కిందకు చేరుతోందని కమిషనర్ గమనించి వెంటనే మరమ్మత్తు పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక లెక్చరర్స్ కాలనీ ప్రాంతంలో విద్యుత్ వీధి దీపాల నిర్వహణ, నూతన రోడ్ల నిర్మాణం పనులు, డ్రైను కాలువలలో పూడికతీత, కాలువల ద్వారా మురుగునీటి ప్రవాహం, మెగా డ్రైను కాలువ నిర్వహణ తీరును కమిషనర్ పరిశీలించారు. స్థానికంగా నిర్మిస్తున్న నూతన భవనాలకు టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులను పరిశీలించి, అనుమతించిన మేరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని యజమానులకు సూచించారు. భవనాలకు సంబంధించిన అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేసే కొలతలు వేసి సరిపోల్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, రెవెన్యూ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరం




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని బాపూజీ నగర్‌లో ఉన్న కొరిడ్ సమస్త ఆధ్వర్యంలో శుక్రవారం సమస్తలో పనిచేయుచున్న నిరుపేద గిరిజనులకు తిరుపతి గుంట, కోటిరెడ్డి గుంటలోని ప్రజలకు డాక్టర్చే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొరిడ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఆర్.జైపాల్ మాట్లాడుతూ.. ఇటీవల సంభవించిన తుఫాను ప్రభావం వల్ల కావలి రూరల్ ప్రాంతాల్లో నిరుపేద గిరిజనులకు అనారోగ్యం ఉన్నందున వారికి మంచి వైద్యం అందేందుకు నిపుణులైన వైద్యాధికారులచే వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో ఈ సమస్త ద్వారా ఇంకా ఎక్కువ మెడికల్ మెగా క్యాంపులు కూడా నిర్వహించబడతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ దంతం సునీల్, నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరిక



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా అధ్యక్షులు సిపా రెడ్డి వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ బిజెపి మండల అధ్యక్షులు రాపూరు ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం నెల్లూరు రూరల్ మండలంలోని ఉప్పుటూరు గ్రామమునందు వైసిపి నాయకులు, కార్యకర్తలు 30 కుటుంబాలు బీజేపీలో చేరారు. వంటేరు దయాకర్ వల్లెపు గోపి, వంటేరు చెంచయ్య, బెల్లంకొండ వినయ్ బెల్లంకొండ కార్తీక్, బెల్లంకొండ హరిబాబు, బెల్లంకొండ చెంచయ్య, బెల్లంకొండ లీలయ్య, దేగ చెంచు మునయ్య, బెల్లంకొండ వంశీ, గుంజి చెంచురత్నం, శేషం శెట్టి సురేష్, వేణు, వంశీకృష్ణ, మహిళలు బీజేపీలో చేరడం జరిగిందని వంశీధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణిరాజు బీజేపీ నాయకులు రావూరు వంశి, సీనియర్ బీజేపీ నాయకులు బెల్లంకొండ చెంచయ్య, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంను సందర్శించిన మాలకొండ రెడ్డి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రఖ్యాత గ్రంథాలయమైన సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంను చరిత్రకారులు సందర్శించి సమాజాన్ని మేల్కొల్పాలని కావలి శాఖ గ్రంథాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు, లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి పేర్కొన్నారు. కడప జిల్లా కేంద్రంలో ఉన్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోనిది దీనిని మాలకొండరెడ్డి, కడప జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఆకిమ్ హజరత్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటిష్ దొర సీపీ బ్రౌన్ తెలుగు భాషకు వన్నె తేవాలని వేమన పద్యాలకు విశిష్టమైన ప్రాధాన్యత కల్పించాలని ఎంతగానో కృషి చేసినారని తెలిపారు. ఈ గ్రంథాలయంలో చరిత్ర పురాతన గ్రంథాలు భారతం భాగవతం ఇంకా అనేక గ్రంథాలు ఉన్నాయని తెలిపారు మేధావులు రచయితలు తెలుగు భాషాభిమానులు పోటీ పరీక్షల్లో ఉద్యోగాలు పొందేవారు ప్రఖ్యాత సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకొని సమాజానికి అందజేయాలని కోరినారు గ్రంథాలయ అధికారుల నుంచి విలువైన సమాచారాన్ని తెలుసుకొని ఈ గ్రంథాలయం యొక్క విశిష్టతని తెలుసుకున్నారని తెలిపారు.

# మర్రిపాడులో ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు గ్రంథాలయంలో కొన్ని రోజులుగా జరుగుతున్న వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ అధికారులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకుంటే వారిలోని సృజనాత్మక విలువలు మరింత పెరుగుతాయని మర్రిపాడు ఎంఈఓ-1 తిరుపతయ్య ఉద్ఘాటించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ అధికారి నారాయణరావు ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయిని పి.పద్మలత అధ్యక్షతన నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు, బహుమతి ప్రధాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సామాజిక విలువలు, సంస్కార విద్య గురించి తెలుసుకునేందుకు గ్రంథాలయంలోని పుస్తకాలు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ప్రతి




విద్యార్థి బాల్యం నుండే గ్రంథాలయానికి వెళ్లడం దినచర్యగా మలుచుకోవాలని సూచించారు. వారోత్సవాల సందర్భంగా జడ్పీ హైస్కూల్, కేజీబీవీ విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ నెల్లూరు, శాఖా గ్రంథాలయం మర్రిపాడు తరఫున ఎంఈఓ-1,2 తిరుపతయ్య, ధనలక్ష్మి, హెచ్ఎం పద్మలతలను శాలువాలతో సన్మానించారు. వారోత్సవాల నిర్వహణలో సహకరించిన గ్రామ పెద్దలు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రతినిధులందరికీ గ్రంథాలయ అధికారి నారాయణరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

# తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేనేతల ధర్నా



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** చేనేత అధికారి రజిని నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తహసిల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేనేత కార్మికులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న బీజేపీ నేత మిడతల రమేష్ మాట్లాడుతూ.. చేనేత అధికారి రజని విధులలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. విడతలు విడతలుగా సర్వేలు చేయడం ద్వారా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని తెలిపారు. జిల్లాలో చేనేత అధికారులు సక్రమంగా పనిచేస్తే చేనేతలు జిల్లాలో పలుప్రాంతాలలో రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అర్హులైన చేనేతలను ఆదుకోమంటే క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల నిరసన తెలుపు తున్నామన్నారు. చేనేత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బుధవరపు బాలాజీ మాట్లాడుతూ.. పొదలకూరు కాలనీలో 36కుటుంబాలు మగ్గాల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని వివరించారు. వరుస వర్షాలు, తుఫానులు కారణంగా చేనేత కార్మికులు రోజువారి పని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత అధికారిణి రజని మూడు మగ్గాలు ఉన్న వారు మాత్రమే తుఫాను సాయంకు అర్హులని నివేదిక ఇవ్వడం దుర్మార్గమన్నారు. మగ్గం కలిగిన మిగతా వారు ఏ పాపం చేశారని వారిని అనర్హులుగా ప్రకటించారో జవాబు చెప్పాల న్నారు. జిల్లాలో చేనేత, జోలి శాఖ అధికారుల వద్ద మగ్గాల గణాంకాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ అధికారి నిర్లక్ష్య వైఖరి వల్ల భవిష్యత్తులో చేనేత కార్మికులు అనేక సంక్షేమ పథకాలు పూర్తిగా కోల్పోనున్నారన్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పూల ప్రశాంత్, ఉపాధ్యక్షుడు చొప్ప వెంకటేశ్వర్లు, బీజేపీ సీనియర్ నాయకులు చింత గింజల సుబ్రమణ్యం, రాచపూటి ధనుంజయ రావు, జానపాటి రామసుబ్బయ్య చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# సమతుల, సేంద్రియ ఎరువులు ప్రయోజనకరం

## రసాయన ఎరువులు తగ్గించాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పైర్ల సాగులో పొలాలకు సమతుల ఎరువులు వాడాలని, సేంద్రియ ఎరువులు ప్రయోజనకరమని, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ యు. వినీత రైతులకు సూచించారు. శుక్రవారం ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్ ఆవరణలో స్థానిక మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణలో మద్రాస్ ఫర్టిలైజర్స్, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సమతుల ఎరువుల వాడకం, సేంద్రియ ఎరువుల వాడకం, కిసాన్ సంగోష్టి, పీఎం ప్రణామ్ అంశాలపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినీత అన్ని అంశాల గురించి సమగ్రంగా వివరించి అవగాహన కల్పించారు. పంటలకు సమగ్ర ఎరువులు వాడాలని, యాజమాన్యం, ఆవశ్యకత, సేంద్రియ, జీవన ఎరువులు గురించి ఆమె




వివరించారు. మద్రాస్ ఫర్టిలైజర్స్ చీఫ్ మేనేజర్ కె.ఆదినారాయణ స్వామి మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. సేంద్రియ ఎరువులు, ప్రయోజనాలు, వినియోగం గురించి వివరించారు. ఏడిఏ ఈ.శైలజాకుమారి మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువుల గురించి, ప్రయోజనం గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఏఎల్ వ్యవసాధికారిణి పి.చంద్రభాను, మద్రాస్ ఫర్టిలైజర్స్ అడిషనల్ మేనేజర్ కె.రాము, ఆత్మకూరు, ఏఎస్ పేట మండల వ్యవసాయాధికారులు కె.కిషోర్‌బాబు, ఎం.సురేషుబాబు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్లీన్ విలేజ్ గ్రీన్ విలేజ్ అంబాసిడర్లకు శిక్షణ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలంలోని చలంచర్ల గ్రామపంచాయతీలో స్థానిక సుస్థిర అభివృద్ధి థీమ్ 5 క్లీన్ విలేజ్ గ్రీన్ విలేజ్ కింద అంబాసిడర్లకు, సిఆర్పిలకు చెత్త నుండి సంపదను తయారు చేసే కేంద్రం వద్ద శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. చెత్త నుండి ఏ విధంగా సంపాదన తయారు చేస్తారు. వచ్చిన సంపద ఏ విధంగా తన గ్రామాలకు అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందో క్షుణ్ణంగా కావలి ఎంపీడీఓ సిహెచ్ శ్రీదేవి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ, కావలి మండల పంచాయతీ సెక్రెటరీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# తటవర్తి రమేష్‌కి జన్మదిన శుభాకాంక్షలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులు తటవర్తి రమేష్ జన్మదిన సందర్భంగా శుక్రవారం రాజకీయ ప్రముఖులు తెలుగుదేశం పార్టీ నాయకులు తటవర్తి వాసు, తిరువీధి ప్రసాద్, అలాగే వాణిజ్య విభాగ ప్రెసిడెంట్ సోమిశెట్టి ఉమామహేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ బలసప్రసాదు వారిని కలిసి సెలవతో సత్కరించి, మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఇంకా ఉన్నత స్థితిలో ఉండాలని భవిష్యత్తులో రాజకీయ పదవులు అలంకరించాలని కోరారు.

# 30న ఏపీ ఎన్జీజీవోస్ ఎన్నికలు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ పొదలకూరు తాలూకా యూనిట్ ఎన్నికలు స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంభందించి ఈనెల 13వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల అధికారిగా తోట మల్లిఖార్జున రావు, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా నల్లగుండ్ల మధు అబ్సర్వర్‌గా ఈదూరు విజయ్ కుమార్‌లను జిల్లా కార్యవర్గం నియమించడం జరిగిందన్నారు. షెడ్యూల్ ప్రకారం తాలూకా యూనిట్‌కు సంభందించి 22వ తేది ఉదయం 11 గంటల వరకు ఓటర్ల నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే 23వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల వరకు నామినేషన్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కావున పొదలకూరు తాలూకా పరిధిలోని ఉద్యోగులందరూ ఈ ఎన్నికలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# మహిళ మెడలో గొలుసు చోరీ

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం చాగలకొండ గ్రామానికి చెందిన కాటంరెడ్డి చిన్న రమణమ్మమెడలో గొలుసు మృతి తెలియని దుండగులు లాకెళ్ళారని బాధితురాలు బావురుమంది. శుక్రవారం ఆమె తన ఇంటి నుంచి బంధువుల ఇంటికి వెళ్తూ ఉండగా పై మార్గం గుండా బైక్ పై వచ్చిన ఇద్దరూ ఆమె నడుచుకుంటూ వెళుతుండగా 60 సంవత్సరాల వృద్ధురాలు కావడంతో వెంటనే ఆమె దగ్గరికి వచ్చి మెడలో ఉన్న చైన్ ను లాగేసి వింజమూరు దారి వెంట వెళ్లిపోయారని ఆమె తెలియజేసింది. ఆ బంగారు గొలుసు రెండున్నర సవర పైగా ఉంటుందని ప్రస్తుతం మూడు లక్షల పైగా విలువ చేస్తుందని ఆమె గోల్లుమన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా వింజమూరు ఎస్ఐ వీర ప్రతాప్ గ్రామానికి చేరుకుని జరిగిన సంఘటనలో పరిశీలించారు.

# చీకటిని చీల్చి వెలుగులు పంచిన జీకేఆర్

**విింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ పరిధిలోని సిద్ధార్థ నగర్ లెక్కలవారి పాలెం సాతానువారిపాలెం గ్రామాలకు రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటే భయం గుప్పెట్లో సాగించాల్సి ఉండేది దశాబ్ద కాలంగా పంచాయతీ పాలకుల చుట్టూ విద్యుత్తు లైట్లు వేయాలని విన్నపించుకున్న మొర ఆలకించే నాదుడే కరువయ్యారు. ఈ ప్రాంత వాసులు ప్రముఖ రియల్టర్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గువ్వల కృష్ణారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. వెనువెంటనే వారి ఇబ్బందులను తొలగించేందుకు రాత్రి వేళల్లో రాకపోకలు సాగించి ప్రజల భయాన్ని పోగొట్టేందుకు రెండు కిలోమీటర్లు మేర చీకటితో అలుముకున్న మార్గంలో ఏకంగా 30విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించి ఆయా ప్రాంతాల్లో వెలుగులు నింపారు. శుక్రవారం గ్రామస్తులు గువ్వల కృష్ణారెడ్డిని ఆహ్వానించి శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాల ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయంతో వనికి పోయేవారన్నారు. రోడ్డుపై కమ్ముకున్న చిమ్మ చీకటి కారణంగా విష సర్పాలువిష జంతువుల భయం అలాగే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని ఆందోళన తమను వెంటాడుతూ ఉండేదన్నారు.



తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు పలుమార్లు పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. గ్రామస్తుల ఆవేదన విన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గువ్వల కృష్ణారెడ్డి తక్షణమే స్పందించి సమస్య తీవ్రతలు అర్థం చేసుకొని సొంత నిధులతో దీపాలును ఏర్పాటు చేసేందుకు కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా గువ్వల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రికి గతంలో నుండి ఈ ప్రాంత వాసులతో సంబంధాలు ఉన్నాయని అప్పట్లోనే సుమారు ఈ కాలనీ ఏర్పాటు సమయంలో తమ సొంత నిధులతో విద్యుత్తు లైను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వింజమూరు నుండి విద్యార్థులు తమ గ్రామాలకు పోతున్న సమయంలో చీకట్లో వారు పడుతున్న భయాన్ని చూశానని పాములు ఇతర ఇబ్బందులు కారణంగా పిల్లలు భయపడకుండా ఉండేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనల మేరకు ఈ దీపాలను ఏర్పాటు చేశారని తెలియజేశారు.

### హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

తమ చిరకాల సమస్యను పరిష్కరించిన గువ్వల కృష్ణారెడ్డి చొరవకు గ్రామస్తులు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో భరించలేని కోతుల బెడద



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని వివిద ప్రాంతాల్లో కోతులబెడద తీవ్రంగా ఉంటూ జనాలు మరింతగా ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగా జెఆర్‌పేట, కొలగానిసత్రం ఏరియాల్లో కోతులు అధికంగా ఉంటూ నానా భీభత్సం సృష్టిస్తున్నాయి. ఇళ్ళలో దూరి వస్తువులను ఛిన్నాబిన్నం చేయడం, ఆహారపధార్థాలు, తినుబండారాలను ఎత్తుకెళ్ళడం, విద్యుత్, డిష్ వైర్లను ఛిన్నాభిన్నం చేస్తుండడంతో జనాలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈకోతుల సంచారంతో చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. ఎన్నిమార్లు అధికారులకు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని జనాలు వాపోతున్నారు. కోతులు ఇళ్ళలో నానాభీభత్సం చేస్తూ నష్టపరుస్తూ ఉంటాయి. సమీపంలోని చెట్లమీద ఉంటూ ఎప్పుడుపడితే అప్పుడు వైర్లమీద వ్రేలాడుతూ ఉండడం, ఇళ్ళలోకి జనాలమద్యనుండే వెళ్ళి దూరుతుండడంతో అత్యంత ఇబ్బందికరంగా ఉంటోంది. దుకాణాల వద్ద కూడా ఈకోతులు పండ్లు, కూరగాయలు, సరుకులు తదితరాలను ఎత్తుకెళుతూ నష్టపరుస్తున్నాయి. వాటిని ఏమాత్రం అదిలించినా పైకిదూకేలా భయపెడుతుంటాయి. ఈపరిస్థితిని అధికారులు గమనించి తగు చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

# కళాకారులను నిర్లక్ష్యం చేయకుండా సంక్షేమకార్యక్రమాలు అమలుచేయాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రంగస్థల,జానపద, పండిరిభజనల, తోలుబొమ్మలాటల, వీధిబాగవతంల కళాకారుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయాలని ఆత్మకూరు ప్రాంతంలోని కళాకారులసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. గత ప్రభుత్వం వద్ద ఎంతగా మొరపెట్టుకున్నా వృద్ధకళాకారులకు పెన్షన్లు, ఆర్టీసీబస్సుల్లో రాయితీ, కళాకారులకు గుర్తింపు కార్డుల మంజూరు, దేవాలయాల్లో, ఆధ్యాత్మిక కేంద్రాల్లో ప్రదర్శనలకు అవకాశం ఇవ్వకపోగా రంగస్థల వృత్తికళాకారులకు బ్రతుకుదెరువుగా ఉన్న చింతామణి నాటక ప్రదర్శనను నిషేధించారని వారు ఆవేదనతో తెలిపారు. గతంలో 15సంవత్సరాల క్రితం నెల్లూరు జిల్లాలో 560 మందికి మాత్రమే వృద్ధకళాకారుల పెన్షన్ మంజూరు చేశారని, అనంతరం ఎంతగా మొరపెట్టుకున్నా 60సంవత్సరాలు దాటిన అర్హులు వందలాదిమంది ఉన్నా వారికి పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. చింతామణినాటక ప్రదర్శనపై విధించిన నిషేధం రద్దుచేయాలని అరిచిగీపెట్టినా గత ప్రభుత్వం ఏమాత్రం పట్టిచుకొనకుండా పెడచెవినపెట్టిందన్నారు. కళాకారులకు గుర్తింపుకార్డులంటూ దరఖాస్తున్న స్వీకరించిన గత ప్రభుత్వం కార్డులివ్వనేలేదన్నారు. వయసు మీరిన అర్హులైన కళాకారులకు పెన్షన్లు మంజూరుచేయాలన్నా జిల్లా పౌరసంబంధాల శాఖకు దరఖాస్తులు చేసే అవకాశం కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదని వారు ఆవేదనతో తెలిపారు. గుర్తింపు కార్డులుంటే ఏదేని ప్రదర్శనలకు వెళ్ళే సమయంలో ఎవరూ అడ్డుకొనకుండా ఉంటుందని భావించినా ఆకార్డులు ఇవ్వలేదన్నారు. ప్రదర్శనలకోసం వివిద ప్రాంతాలకు ప్రయాణాలు చేయాల్సి ఉన్నందున ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని కూడా కోరినా పట్టించుకోలేదన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా కళాకారుల వృత్తి ప్రాధాన్యతగా అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని, అందరు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలని, ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని, కళాప్రదర్శనలే వృత్తిగా నమ్ముకొని సరైన అవకాశాలు లేక ఇబ్బందిపడుతున్నందున కళాకారుల ప్రదర్శనలకు దేవాలయాలు, ధార్మికసంస్థల్లో అవకాశం కల్పించాలని వారు నేటి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తాము ప్రజలమేనని, ఓటర్లమేనని, తాము కూడా ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నామని, అన్నివర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం కళాకారులను కూడా ఆదుకోవాలని, తమ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

## ముగ్గురు తహసిల్దార్ల బదిలీలు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో ముగ్గురు తహసిల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఉత్తర్వులు జారీ చేశారు. పివి కృష్ణారెడ్డిని కలువాయి తహసిల్దార్‌గా నియమించారు. అలాగే కందుకూరు డీఏఓగా ఉన్న ఎస్ సీతామహాలక్ష్మిని జలదంకి తహసిల్దార్‌గా బదిలీ చేశారు. చేజర్ల తహసిల్దార్గా ఉన్న బి.మురళిని ఇందుకూరుపేట తహసిల్దార్‌గా నియమించారు. అలాగే మరో నలుగురు డిప్యూటీ తాసిల్దార్లను బదిలీ చేశారు.

# గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ




**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి పంచాయతీ పరిధిలోని చెత్త నుండి సంపద కేంద్రం వద్ద శుక్రవారం మండలంలోని గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో బ్రహ్మయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించే విధానాలను తెలియజేశారు. జలదంకి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు గ్రీన్ అంబాసిడర్లు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చెత్త నుంచి సంపద తయారీతో పంచాయతీలకు కొంతమేర లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ, గ్రీన్‌అంబాసిడర్ల పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల్లో రక్తదానం చాలా ముఖ్యం

▶ మండల టీడీపీ అధ్యక్షుడు నీలం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సేవా కార్యక్రమాల్లో రక్తదానం చాలా ముఖ్యమని మండల టిడిపి అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ అన్నారు. శుక్రవారం కృష్ణపట్నం గ్రామపంచాయతీలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా నీలం ప్రారంభించారు. స్థానిక అధికార పార్టీ నాయకులు రాగాల శివకృష్ణ సహకారం అందించారు. ఈసందర్భంగా యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నీలం మాట్లాడారు. ఎంతోమందికి సహకారం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను అభినందిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, హరిహరాదుల సేవా సమితి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 13న నవోదయ ప్రవేశ పరీక్ష

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం కొరకు ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13న నిర్వహిస్తున్నట్లు ఆ విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ పార్వతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు జిల్లాలోని అన్ని కామన్ సర్వీస్ కేంద్రాలలో, నవోదయ విద్యాలయ సమితి వెబ్సైట్ www.navodaya.gov.in ద్వారా విద్యార్థి రిజిస్ట్రేషన్ నెంబర్, పుట్టిన తేదీని ఉపయోగించి డౌన్లోడ్ చేసుకోవచ్చు అని తెలిపారు. దీంతోపాటుగా జవహర్ నవోదయ విద్యాలయంలో కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ప్రవేశ పరీక్ష ఇతర సమాచారం కొరకు 68886194201, 9493514644, 8985007588 నంబర్లను సంప్రదించవచ్చునని ఆమె పేర్కొన్నారు.

# సాగునీటి వృథాకు అడ్డుకట్ట

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని శకునాలపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఊరు చెరువుకు జలకళ సంతరించుకుంది. అయితే చెరువు అలుగు ప్రాంతం దెబ్బతిని నీరు వృథాగా పోతుండడంతో చెరువు ఆయకట్టును దృష్టిలో ఉంచుకుని గ్రామ టీడీపీ నాయకుడు పాలగిరి మహేష్ రెడ్డి తన సొంత నిధులు వెచ్చించి ఎక్స్కవేటర్ సహాయంతో నీటి వృథాకు అడ్డుకట్ట వేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈర్ల సుధ, కారంపూడి కేశవనారాయణ, వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లిలో రికార్డు స్థాయిలో ముఖ్యమంత్రి సహాయనిధి




- కూటమి ప్రభుత్వం వచ్చాక 514 మందికి రూ.5.34 కోట్లు మంజూరు
- నేడు 92 మందికి రూ.74 లక్షల చెక్కుల పంపిణీ
- కాకాణి తినింది అరగక మాట్లాడుతున్నాడు
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి




**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని వేదాయపాళెం కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలను ఉదారంగా ఆదుకుంటున్నారన్నారు. ఒక్క రోజే 92 మందికి రూ.74 లక్షల విలువైన చెక్కులు అందజేశామన్నారు. ఇప్పటివరకు సర్వేపల్లి నియోజకవర్గంలో 514 మందికి రూ.5.34కోట్లు అందించామన్నారు. పేదలతోపాటు రైతుల విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20వేలు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రూ.13,500 మాత్రమే ఇచ్చిందన్నారు. మత్స్యకారులకు వేట విరామ భృతిని గతంలో రూ.10వేలు ఇస్తుంటే రూ.20 వేలకు పెంచాంఅన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు చొప్పున అందించాం అన్నారు. ఆడపడుచులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందుకుంటున్నారన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.4వేలు, రూ.6 వేలు, రూ.15వేలు పింఛన్ అందిస్తున్నాన్నారు. ఏడాదికి రూ.33 వేల కోట్లు పింఛన్ పథకానికి కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తోందని అన్నారు. పేదలను ఆర్థికంగా స్థిరపరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం కోసం ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నేరాలు, ఘోరాలు తప్ప ప్రజలకు జరిగిన ప్రయోజనం శూన్యం అన్నారు. మొన్న దేగపూడి రాజుపాళెం వద్ద కల్వర్టు కూలిపోతే అధికారులను అప్పటికప్పుడు అప్రమత్తం చేసి యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేయించామన్నారు. ఆర్ అండ్ బీ అధికారులతోపాటు స్థానిక టీడీపీ నేతలు తెల్లవార్లూ మేలుకుని రోడ్డుపై రాకపోకలను పునరుద్ధరించారని తెలిపారు. నా ఫ్రెండ్ కాకాణి నిన్న ఆ కల్వర్టు వద్దకు వెళ్లి నోటికొచ్చినట్టు మాట్లాడి వచ్చాడు అని తెలిపారు. కండలేరు సిస్టమ్ కింద మనుబోలు మండలానికి 1.5 టీఎంసీలుగా ఉన్న నీటి కేటాయింపులను 2017లో రూ.2.5 టీఎంసీలకు పెంచామని తెలిపారు. టీఎంసీ అంటే అర్థం తెలియని వ్యక్తి, ఒక టీఎంసీకి ఎన్ని ఎకరాల పంట పండుతుందో అవగాహన లేని వ్యక్తి, సేద్యం అంటే తెలియని వ్యక్తి మా గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. 2023లో మనుబోలులో మొదటి పంట క్రాఫ్ హాలిడే ప్రకటించిన పెద్దమనుషులు వీళ్లు.. అప్పట్లో మేం వెంటనే స్పందించి రైతులతో అధికారులను నిలదీయిస్తే నీటిని విడుదల చేశారని తెలిపారు. కండలేరు సిస్టమ్ కింద నీటిని వాడుకోవడం మనుబోలు మండల దిగువ గ్రామాల రైతుల హక్కు అని తెలిపారు. దేగపూడి బండేపల్లి కాలువకు నిధులు తెచ్చి పనులు ప్రారంభిస్తే వైసీపీ అధికారంలోకి రాగానే అడ్డుకున్నారని పేర్కొన్నారు. పొదలకూరు మండలంలో సోమశిల దక్షిణ కాలువ పనులను అర్థంతరంగా ఆపేశారని తెలిపారు. తిరుమలమ్మపాళెం హైలెవల్ బ్రిడ్జిని పనులు ప్రారంభించే సమయంలో అడ్డుతగిలారని అన్నారు. సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ పనులకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మేం నిధులు మంజూరు చేయించామన్నారు. వైసీపీ పాలనలో తూతూమంత్రంగా పనులు చేసి ఉన్న కట్టను మరింత బలహీనం చేసిపెట్టారని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి చెప్పుకునేందుకు చేసిన పని ఒక్కటుందా అని ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారాన్ని వెలగబెట్టిన ఆయన సర్వేపల్లి నియోజకవర్గానికి సీఎస్ఆర్ నిధులు ఎంత సాధించాడో చెప్పగలరా అని ప్రశ్నించారు. సిగ్గుశరం లేకుండా నీచాతినీచంగా మాట్లాడమే పనిగా పెట్టుకున్నాడు.. అడ్డంగా తినేసి వళ్లు బలిసి వ్యవహరిస్తున్నాడని విమర్శలు గుప్పించారు. ఇప్పటికైనా కొంచెం సంస్కారం అలవాటు చేసుకోవాలని హితవు పలుకారు.

## అయ్యప్ప స్వామి మండల పూజల మహాదీపారాధన

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వేదాయపాలెంలో వేంచేసి ఉన్న వేద శాస్త్ర శ్రీ స్వామి అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి వారికి కేరళ సాంప్రదాయ మండల పూజలు శుక్ర వారం జరిగింది తొలుత అయ్యప్ప స్వామి వారి నిర్మాల్య దర్శనం పాలాభిషేకం, మహాగణపతి హెూమం, స్వామి వారికి ఉషః పూజ, శ్రీ వేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, ఉచ్ఛ పూజ, శ్రీ వేలి ఉత్సవం, సాయంత్రం పూలంగి సేవ దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, అత్తలపూజ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర దీపం, హరిహరాసనం అయ్యప్ప స్వామివారి సేవలు కేరళ సాంప్రదాయంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి బండారు మధుసూదన్ రెడ్డి, రజిని సరస్వతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం అయ్యప్ప స్వామి భక్తులకు అన్నదాన కార్యక్రమంకు బుద్దులూరు వెంకటేశ్వర్లు, భవాని దంపతులు, సాదు వంశీధర్, సుమలత దంపతులు, వింజమ్ నారాయణ, కవిత దంపతులు, రాత్రి స్వాములకు బిక్ష కార్యక్రమానికి సృజన, కృష్ణ కుమార్, ప్రవీణ్ సింగ్, మధన్ సింగ్, ఉభయకర్తలుగా



వ్యవహరించారు. అధ్యక్షులు గూడల శేషగిరిరావు కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షణలో ఘనంగా జరిగాయి. కమిటీ సభ్యులు కేజీ శంకరన్, బొగ్గుల మురళీమోహన్ రెడ్డి, పావలా ప్రసాద్, అశోక్ చంద్ర పలువురు అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## ఆలయంలో రాహుకాల ఉద్యాపన పూజ





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం విశేషంగా రాహుకాల ఉద్యాపన పూజలో 11 మంది పాల్గొని శ్రీ అమ్మవారికి చీర జాకెట్టు, 108 నిమ్మకాయల మాలలు సమర్పించారు. రాహుకాల దీపాలు చేసిన శ్రీ అమ్మవారిని దర్శించుకొన్నారు. ప్రతి శుక్రవారం భక్తుల విరాళాల ద్వారా దేవస్థానం తరపున అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. అన్నదాన కార్యక్రమాన్ని బయోమెట్రిక్ విధానం ద్వారా నిర్వహించుట జరుగుతుంది. ఈ శుక్రవారం రెండు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేయుట జరిగింది. ఇదేవిధంగా ప్రతి శుక్రవారం జరగు అన్నదాన కార్యక్రమంకు భక్తులు విరాళాలు ఇవ్వాలని ఆలయ ఈఓ కోరారు. సాయంత్రం 6 గంటలకు వేదపారాయణం, 6.30 గంటలకు సంధ్యామేళం, రాత్రి 7.30 గంటలకు కుంభ హారతులు, 8 గంటలకు పల్లకీ సేవ కార్యక్రమాలు జరిగాయని సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు.

## పూడికతీతకు నోచుకోని ఉప్పలాయి కాలువ

- దుర్గంధం దోమలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్న పేడూరు గమల్లపాలెం కాపురస్తులు
- పట్టించుకోని పంచాయతీ సాగునీటి సంఘాలు

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** తోటపల్లి గూడూరు మండలం పేడూరు గమల్లపాలెం రామాలయం సమీపంలో డ్రైను పూర్తిగా పూడిపోవడంతో మురికి నీరు చేరి దుర్గంధం దోమలతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక గమల్లపాలెం కాలనీ వాసులు తెలిపారు, ప్రధానంగా ఉప్పలాయి కాలవ పూడికతీత తీయకపోవడంతో నీళ్లు పోయే వీలు లేక ఇళ్ళ ముందు నుంచి పోయే కాలువ పూర్తిగా చెత్తాచెదారంతో నిండి ఇటీవల వర్షాలకు భయంకరంగా మారింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలను పర్యవేక్షించాల్సిన అధికారులు సాగునీటి సంఘాలు పట్టించుకోకపోవడంతో ఈ సమస్య ఏర్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటు స్థానిక పంచాయతీ తీర్మానం ద్వారా ఉపాధి హామీ పథకంలో చేర్చి కాలువను తవ్వించాల్సి ఉంది. కానీ వారు కూడా తమకే మీ పట్టనట్లు ఉండడాన్ని స్థానిక కాలనీవాసులు విమర్శించారు. దీనిపై ఆయా శాఖల అధికారులు స్పందించకపోవడాన్ని కాలనీ వాసులు మీడియా దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా స్పందించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉప్పలయ్య కాలువ పూడిక తీసి ఇంటి ముందు ఉన్న కాలువల ద్వారా మురుగునీరు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## ఎంప్లాయిస్ గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న కలెక్టర్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డేను కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 22 మంది ఉద్యోగస్తులు వారి వారి సమస్యలకు సంబంధించిన అర్జీలను కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ప్రతి ఉద్యోగస్తునితో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వారితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగస్తులు కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

